

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

మంగళవారం
10 నవంబర్ 2026

పేజీలు : 08



Follow :



కొడంగల్ అభివృద్ధికి రూ. 9053 కోట్లు

2028 నాటికి కృష్ణా జలాలతో ప్రతి ఎకరాకు సాగునీరు

13 కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- రహదారులు, సాగునీరు, విద్య, పరిశ్రమలకు ప్రాధాన్యం
- రూ.7.79 కోట్లతో పోలీస్‌స్టేషన్, జూనియర్ కళాశాల భవనాలు ప్రారంభం
- హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌తో వేలాది మందికి ఉపాధి

పాలమూరు ప్రాంతం దశాబ్దాలుగా కరువు, వలసలతో ఇబ్బందులు ఎదుర్కొందని సీఎం పేర్కొన్నారు. భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదన్నారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని గత పదేళ్లు పక్కన పెట్టారని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లిస్తూనే అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నామని తెలిపారు. పారిశ్రామిక వాడల ఏర్పాటుతో వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. సన్నబియ్యం విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వానికి తగినన్ని నిల్వలు ఉన్నాయని భరోసా ఇచ్చారు.

వికారాబాద్ జిల్లా బ్యూరో/కొడంగల్/బొంరాస్‌పేట, నవంబర్ 9 (జనం సాక్షి):

కొడంగల్ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి, 2028 నాటికి కృష్ణా జలాలతో ఈ ప్రాంత భూములను తడిపి పచ్చని పంటలు పండించేలా కృషి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆలయం నుంచి సభా ప్రాంగణం వరకు పాదయాత్ర చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

ప్రధానంగా కొత్వాల్‌గూడ నుంచి నాచారం వరకు రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు నిర్మాణం, రూ.1,410 కోట్లతో 223 బీటీ రహదారుల అభివృద్ధి, రూ.2,100 కోట్లతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ పనులు చేపట్టనున్నారు. విద్యారంగంలో రూ.118.80 కోట్లతో పది తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.123 కోట్లతో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొడంగల్, కోస్గి, మద్దూరులో రూ.41.83 కోట్లతో ఆధునిక బస్టాండ్లు, మద్దూరులో రూ.20 కోట్లతో నిర్మాణ నైపుణ్యాభివృద్ధి కేంద్రం, రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం ఏర్పాటు చేయనున్నారు. హకీంపేట పారిశ్రామిక కారిడార్‌లో పర్యాటక హోటల్, అప్పారెల్ పరిశ్రమల మౌలిక వసతులు, రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టారు. తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం, కొడంగల్‌లో నిరంజన్ మఠం అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

మరోవైపు బొంరాస్‌పేట మండలంలో రూ.7.79 కోట్లతో నిర్మించిన ఆధునిక పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, కళాశాల తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. నూతన భవనాల అందుబాటులోకి రావడంతో పోలీసు సేవలు మెరుగుపడటంతో పాటు విద్యార్థులకు మెరుగైన వసతులు లభించనున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డికి తాండూరు నుండి జన్మదిన శుభాకాంక్షలు

మర్యాదపూర్వకంగా కలిసిన చైర్ పర్సన్ నీరజా, ఎమ్మెల్యే బీఎంఆర్.

తాండూరు : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్ రెడ్డి శాసన సభ్యులు బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి పూల గుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశామని తెలిపారు. భగవంతుడు సీఎం రేవంత్ రెడ్డికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని, రాష్ట్ర ప్రగతి కోసం వారు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.









ఘనంగా రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



మల్కాజిగిరి నవంబర్ 9(జనంసాక్షి) కాంగ్రెస్ పార్టీతోనే సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం మల్కాజిగిరిలోని సాయినగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, మురుగేష్, మీనా ఉపేందర్ రెడ్డి, నియోజకవర్గ బాధ్యుడు లక్ష్మీకాంత్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, పిట్ల శ్రీనివాస్, ఎస్.ఈర్. ప్రసాద్, శ్రీరామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో అమావాస్య వేళ ఆధ్యాత్మిక శోభ

ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో అన్నదానం



హయత్ నగర్, నవంబర్ 9 (జనం సాక్షి)అన్నదానం మహాదానమనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ హయత్‌నగర్ ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో ప్రతి నెలా అమావాస్య సందర్భంగా నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. హయత్‌నగర్ కుంట్లూరు రోడ్డులోని వీరభద్ర పూజా సెంటర్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజ రయ్యారు. నిర్వాహకులు, స్వచ్ఛంద సేవకులు భక్తులకు అన్నప్రసాదాన్ని ఆప్యాయంగా వడ్డించారు. ఈ సందర్భంగా నిర్వాహ కులు మాట్లాడుతూ.. ప్రతి నెలా అమావాస్య రోజున దాతలు, భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నా మని తెలిపారు. అన్నదానం ద్వారా ఆకలితో వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆహారం అందించడంతో పాటు సేవాభావం, మానవత్వం, ఐక్యతను పెంపొందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమ విజయాని కి సహకరించిన దాతలు, ఆర్య వైశ్య సంఘ సభ్యులు, స్వచ్ఛంద సేవకులకు కృతజ్ఞతలు తెలిపారు.

దృష్టిలోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రపంచంలోనే తొలి లా కాలేజీ



శంషాబాద్, నవంబర్9 (జనంసాక్షి) ప్రపంచంలోనే తొలిసారిగా దృష్టిలోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా లా కాలేజీని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ప్రకటిం చారు.ముచ్చింతల్‌లో శ్రీ చినజీయర్ స్వామి 70వ తిరునక్షత్ర మహోత్సవం 'యతీంద్ర సప్తతి' రెండో రోజు కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ కాలేజీ ఏర్పాటుకు ఉన్నత విద్యామండలి ఆమోదం తెలిపిందన్నారు. కాగా, యతీంద్ర సప్తతి వేడుకల్లో భాగంగా దేశ, విదేశాల్లోని జీయర్ సంస్థలు తమ సేవా కార్యక్రమాలను స్వామివారికి వివరించాయి. ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగానికి వెళ్లి అదృశ్యమైన వ్యక్తి

భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



చేవెళ్ల, నవంబర్ 09 (జనంసాక్షి) ఉద్యోగానికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం ఆలూర్ గ్రామానికి చెందిన పొట్ట శ్రీనివాస్ (34) ఈ నెల 7వ తేదీ ఉదయం చేవెళ్లలోని పీఎంఆర్ ఆసుపత్రిలో సెక్యూరిటీ ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అదే రోజు రాత్రి 7.30 గంటలకు భార్యకు వాట్సాప్ కాల్ చేసి ఇంటికి వస్తున్నానని తెలిపాడు. అయితే ఎంతసేపటికీ ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. మరుసటి రోజు ఆసుపత్రికి వెళ్లి విచారించగా శ్రీనివాస్ విధులకు హాజరుకాలేదని సిబ్బంది తెలిపారు. బంధు వులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభిం చకపోవడంతో భార్య భీమమ్మ చేవెళ్ల పోలీసుల కు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన శ్రీనివాస్ ఎత్తు సుమారు 5 అడుగుల 1 అంగుళం, గోధుమ రంగు ఛాయ కలిగి ఉంటా డని పోలీసులు తెలిపారు. చివరిసారిగా లేత ఆకుపచ్చ రంగు షర్ట్, ఫార్మల్ ప్యాంట్ ధరించినట్లు వెల్లడించారు. అతని ఆచూకీ తెలిసిన వారు చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

చేవెళ్ల తహసీల్దార్ కార్యాలయ పాత క్వార్టర్స్‌లో అగ్ని ప్రమాదం

టపాసుల నిప్పురవ్వలతో పాత కాగితాలకు మంటలు.. తప్పిన పెను ప్రమాదం



చేవెళ్ల, నవంబరు 09 (జనంసాక్షి) చేవెళ్ల పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ పరిధిలో ఉన్న వినియోగంలో లేని పాత క్వార్టర్స్‌లో ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అక్కడ నిల్వ ఉంచిన పనికిరాని పాత కాగితాలకు మంటలు అంటుకోవడంతో స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో షాద్‌నగర్ నుంచి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం, గాయాలు సంభవించలేదు. భవనానికి కూడా పెద్దగా నష్టం వాటిల్లలేదు. పాత కాగితాలు మాత్రమే పాక్షికంగా కాలిపోయాయి. ఘటన జరిగిన వెంటనే తహసీల్దార్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ నగేష్ అక్కడికి చేరుకుని కాలిపోయినవి పనికిరాని పాత కాగితాలేనని, ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన రికార్డులకు ఎలాంటి నష్టం జరగలేదని నిర్ధారించారు. దీపావళి సందర్భంగా సమీపంలోని సీపీఐ కాలనీలో టపాసులు కాల్చడంతో నిప్పురవ్వలు క్వార్టర్స్‌లోకి ఎగిరిపచ్చి కాగితాలకు మంటలు అంటుకున్నాయని తహసీల్దార్ బి. కృష్ణయ్య తెలిపారు. సోమవారం ఉదయం ఆయన శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని పరిశీలిం చారు. తెరిచి ఉన్న కిటికీల ద్వారా టపాసుల నిప్పురవ్వలు లోపలికి వెళ్లకుండా ప్లైవుడ్‌తో కిటికీలను పూర్తిగా మూసివేయించారు. కాలనీలో కొందరు యువకులు టపాసులు కాల్చి కిటికీల్లో నుంచి లోపలికి వేయడం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు.

ఎల్ నినో ను ఎదుర్కొనే శక్తిని రాష్ట్ర ప్రభుత్వానికి అమ్మవారు ఇవ్వాలి

సిద్దులూరు పోచమ్మ తల్లిని దర్శించుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్, నవంబర్ 06, (జనంసాక్షి):వికారాబాద్ నియోజకవర్గం వికారా బాద్ మండలంలోని సిద్దులూరు గ్రామంలో కొనసాగుతున్న పోచమ్మ తల్లి 3వ జాతర వార్షికోత్సవాల్లో తెలంగాణ శాసన సభాపతి , వికారాబాద్ శాసన సభ్యులు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు పాల్గొన్నారు.ముందుగా ఆలయంలో పోచమ్మ తల్లిని దర్శించుకుని , ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడు తూ..పోచమ్మ తల్లి జాతరలో పాల్గొనడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ జాతరను ఇంత ఘనంగా నిర్వహిస్తున్న గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ కు , గ్రామ పెద్దలకు, యువకులకు, మహిళలకు, గ్రామస్తులందరికీ హృదయ పూర్వక అభినందనలు తెలిపారు, పోచమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలకు, వికారాబాద్ నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు, ఎల్ నినో వంటి విపత్తులను ఎదుర్కొనే శక్తిని రాష్ట్ర ప్రభుత్వానికి, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అమ్మవారు ఇవ్వాలని ప్రార్థించారు కరువు నుండి గట్టెక్కించి, రైతులు, ప్రజలందరూ సుభిక్షంగా ఉండేలా అమ్మవారు చూడాలని మొక్కుకున్నారు గ్రామంలో ఐక్యత, సంతోషం, శాంతి ఎప్పుడూ ఇలాగే కొనసాగాలని కోరుకుంటూ, అందరికీ జాతర శుభాకాంక్షలు తెలిపారు అంతకు ముందు గ్రామస్తులు సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారికి ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామస్తులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలి



కేశంపేట, నవంబర్ 9 (జనం సాక్షి) : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కును కల్పించాలని మండల సర్పంచులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ... గ్రామ ప్రథమ పౌరులుగా గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తున్న సర్పంచులకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీల మాదిరిగా ఓటు హక్కు కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ గ్రామ ప్రగతికి పాటుపడేది సర్పంచులేనన్నా రు. అటువంటి సర్పంచులకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోవడం ప్రజాస్వామ్యంలో లోటు అని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సర్పంచులకు ఓటు హక్కు కల్పించేలా చట్టాల్లో సవరణ తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని సర్పంచులందరూ ఐకమత్యంతో వ్యవహరించి ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలన్నారు. గ్రామ స్వరాజ్యం బలోపేతం కావాలంటే సర్పంచులకు సముచిత గౌరవంతో పాటు అధికారాలు, హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తొమ్మిది రేకుల సర్పంచ్ బీస కవిత కరుణాకర్ రెడ్డి, నిర్ధవెల్లి సర్పంచ్ చెదురువెల్లి భాస్కర్ గౌడ్, బోధునం పల్లి సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్, పుట్టొని గూడ సర్పంచ్ కాట్రావత్ చప్లి భాస్కర్ నాయక్, దత్తాయ పల్లి సర్పంచ్ మామిడిపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

క్రీడలు పోటీ తత్వాన్ని క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయి

చందానగర్ ఎస్సై శీనయ్య

శేరిలింగంపల్లి, నవంబర్ 09 (జనంసాక్షి) : క్రీడలు ఎక్కడైనా విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు దేహదారుఢ్యం, ఏకాగ్రతను పెంపొందింపజేస్తాయని చందానగర్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శీనయ్య పేర్కొన్నారు. డాక్టర్ బి ఎస్ రావు స్మారక క్రీడా పోటీ వేడుకలు శ్రీ చైతన్య స్కూల్ శేరిలింగంపల్లి పాఠశాల ప్రాంగణంలో ప్రారంభమైన సందర్భంలో ఎస్సై శీనయ్య ముఖ్యఅతిథిగా హాజరై వాటిని ప్రారంభించారు. కాగా ఈ స్మారక క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగడం విశేషం. విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని క్రమశిక్షణకు మరియు జట్టు భావాన్ని పెంపొందించేందుకు ఈ వేడుక ఘనంగా నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలియజేశారు. ఈ క్రమంలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చందానగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శీనయ్య కు పాఠశాల ప్రిన్సిపల్ వాణీప్రసాద్ మరియు యాజమాన్య సభ్యులు ఘన స్వాగతం పలికారు. పాఠశాల పతాకావిష్కరణ జాతీయ గీతాలాపనతో వేడుకలు ఘనంగా ప్రారంభం కావడం విశేషం. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్ఫాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది పాఠశాలలోని నాలుగు హౌజ్ లకు చెందిన విద్యార్థులు బ్యాండ్ మరియు మేళతాళాల నడుమ క్రమశిక్షణతో మార్చ్ఫాస్ట్ చేశారు. వందన సమర్పణ స్వీకరించిన అనంతరం ముఖ్య అతిథి శీనయ్య మాట్లాడుతూ విద్యార్థులు మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహద పడతాయని గెలుపోటములు



సమానంగా స్వీకరించడమే నిజమైన క్రీడా స్ఫూర్తి అని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా తమ పాఠశాల ప్రాధాన్యత ఇస్తుందని ఇందులో పాల్గొన్న విద్యార్థులు అందరికీ అభినందనలు తెలిపారు ప్రారంభోత్సవం అనంతరం విద్యార్థులు కొన్ని ఆటలతో క్రీడా పోటీలు ప్రారంభించారు ఈ ఉత్సవాలు తాలుల మరికొన్ని రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ వివరించారు. పాఠశాల స్థాయిలో క్రీడలు ముగిసిన పిదప జోనల్ స్థాయిలో జరుగుతాయని పాఠశాల ప్రిన్సిపల్ వాణి ప్రసాద్ తెలిపారు. కాగా క్రీడల ప్రారంభోత్సవ వేడుకలకు అతిథులుగా పాఠశాలల ఏజీఎం శివరామకృష్ణ, రీజనల్ ఇన్చార్జ్ హరికృష్ణ, జోనల్ కోఆర్డినేటర్ వెంకట శివ, జోనల్ పిఇటి ఇన్చార్జ్ మధు, డీన్ రాజేష్, ఐపిఎల్ ఇంచార్జ్ సృజన, ప్రైమరీ ఇంచార్జ్ మాధవి, బ్రాంచ్ పిఇటి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఎమ్మెల్యే యాదయ్య దీపావళి సంబరాలు

ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు.. కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే

చేవెళ్ల, నవంబర్ 09 (జనంసాక్షి) చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దండు ఇందిరమ్మవెంకటయ్య పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహాలను సందర్శించి, వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. నూతన గృహాల్లో పండుగ జరుపుకుంటున్న లబ్ధిదారులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేసి, వారితో కలిసి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్గారి జనార్ధన్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, చేవెళ్ల, ముడిమ్యాల సొసైటీ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్



రాముగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాగిరెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి, పైండ్ల మధుసూదన్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, తాళ్లపల్లి నర్సింలు, పడాల ప్రభాకర్, మధుసూదన్ గుప్తా, కుంచం శివ కుమార్, బేకులపల్లి శ్రీనివాస్, కో ఆప్షనల్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబ భూ అన్యాక్రాంతంపై 2వ రోజు నిరాహార దీక్ష



సిపిఎం పార్టీ మద్దతు

యాచారం, నవంబర్ 9(జనం సాక్షి) యాచారం మండలం, తూలేకుర్దు రెవెన్యూ పరిధిలోని ధర్మన్నగూడ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం తమకు రావాల్సిన భూమి కోసం చేపట్టిన న్యాయ్యమైన పోరాటానికి సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సర్వే నంబర్ 167లో తమ వారసత్వ భూమిని అన్యాక్రాంతం చేయాలని చూస్తున్న వారి మోసాన్ని నిరసిస్తూ బాధితులు చేపట్టిన నిరాహార దీక్ష సోమవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది.ఈ నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి, బాధితులకు అండగా నిలిచిన సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి. అంజయ్య మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబానికి చెందిన తెరటి పుణ్యాలు, తెరటి నిర్మలమ్మల కుటుంబం మూడు తరాలుగా సుమారు 3.20 ఎకరాల భూమిని నమ్ముకుని జీవిస్తోందని తెలిపారు. కనీసం ఇల్లు కూడా లేని ఈ నిరుపేద కుటుంబానికి ఆకుల కోటయ్య టెనెంట్గా ఉన్నాడని పేర్కొన్నారు.1992వ సంవత్సరంలో తెరటి పుణ్యాలు, తెరటి నిర్మలమ్మ కుటుంబానికి పట్టా చేస్తానని చెప్పి డబ్బులు తీసుకుని అగ్రిమెంట్ చేసుకున్న ఆకుల కోటయ్య.. దాదాపు 40 సంవత్సరాలు గడుస్తున్నా ప్రతిసారీ వాయిదాలు వేస్తూ మోసం చేశాడని ఆరోపించారు. అంతేకాకుండా, ఆ భూమిని తన కొడుకు ఆకుల శ్రీనివాస్ పేరున పట్టా చేయించుకోవడం అత్యంత దుర్మార్గమని తీవ్రంగా మండిపడ్డారు. భూమి కోసం అమాయక కుటుంబాన్ని పోలీస్ స్టేషన్లు, కోర్టులంటూ తిప్పుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారి ఆటలు ఇకపై సాగవని హెచ్చరించారు. “నీవు బతికే ఉన్నావు, సాక్షులు కూడా బతికే ఉన్నారు.. చేసిన అగ్రిమెంట్ నిజమో కాదో ప్రజల ముందు తేల్చుకోవాలి” అని ఆకుల కోటయ్యను ఆయన హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు సిపిఎం పార్టీ తరఫున ప్రత్యక్ష పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు ఎం. బాల్రాజ్ మాజీ వైస్ ఎంపీపీ ఎం. శ్రీమన్నారాయణ, సిపిఎం శాఖా కార్యదర్శులు పి. రమేష్, ఎం. గోపాలకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ పాండుచారి, సీనియర్ నాయకులు ఎం. సత్తయ్య, ఎం. రాములు, ఎన్. సత్తయ్య, పి. సత్యనారాయణ, రవీంద్ర, జె. హన్మంతు, ఆనంద్, నవీన్, రామకృష్ణ, జి. శ్రీశైలం, కోటయ్య, బి. శేఖర్, నరేష్, జ్యోతి నిరాహార దీక్షలో బాధితులు తెరటి పుణ్యాలు, తెరటి నిర్మల, తెరటి నర్సింహా, పెంటమ్మ, కవిత, తెరటి శ్రీనివాస్, కేశవులు, దశరథ పాల్గొన్నారు.

శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



శామీర్ పేట, నవంబర్ 9(జనం సాక్షి) శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధానార్చకులు మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు సోమ వారం జరిపారు. అమావాస్యను పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాలు, నీళ్లతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. స్వామివారి అభిషేకానికి భక్తులు పోటాపోటీగా బారులు తీరి అభిషేకం చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా అలియాబాద్లో సదర్ సమ్మేళనం వేడుకలు



శామీర్ పేట్, నవంబర్ 9(జనం సాక్షి)అలియాబాద్ మున్సిపాలిటీలో కేంద్రం లో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్ కార్యక్రమాన్ని అలియాబాద్ మున్సిపల్చైర్మన్ కంటం శిరీష కృష్ణారెడ్డి ప్రారంభించారు. దున్నపోతుల ప్రదర్శన, ర్యాలీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గూదే వెంకటేష్, సుధాకర్ రెడ్డి, గాదె వెంకటేష్, కైరా గణేష్, దీనిష్,యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శివాలయంలో ఘనంగా మాస శివరాత్రి పూజలు



శామీర్ పేట, నవంబర్ 9 (జనం సాక్షి)ఘనంగా మాస శివరాత్రి పూజలను నిర్వ హించారు. మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో (శివాలయం) ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. శామీర్ పేట, ఉప్పర్ పల్లికి చెందిన భజన మండలి సభ్యులు భక్తి గీతాలు ఆల పించారు. భక్తుల సహకారంతో అన్నదానం చేపట్టగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. అలాగే ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలోని శివా లయాలలో మాసశివరాత్రి పూజలను నిర్వహించారు.

అమావాస్య సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అన్నదానం

ఎల్లమ్మ గుడి వద్ద అన్నప్రసాద వితరణ



అల్వాల్, నవంబరు 9 (జనంసాక్షి): అన్నార్తులకు అన్నదానం చేయడం మహోన్నతమైన సేవా కార్యక్రమమని అల్వాల్ మండల ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అన్నారు. అమావాస్య సందర్భంగా సోమవారం అల్వాల్లోని ఎల్లమ్మ గుడి వద్ద సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు, అన్నార్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడం ద్వారా ఆత్మసంతృప్తి కలుగుతుందని సంఘం సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మంచాల రవీందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి జి.జగ్గయ్య, కోశాధికారి ఉప్పల నరేందర్, పాల్గొన్నారు.

అన్నదానంతో సేవాభావం చాటిన ఆర్యవైశ్య మిత్రబృందం

జొన్నబండలో అన్నప్రసాద వితరణ.. దాతలకు వాసవీమాత విగ్రహం



అల్వాల్, నవంబర్ 9 (జనంసాక్షి): ఆర్యవైశ్య మిత్రబృందం అల్వాల్ మండలం ఆధ్వర్యంలో సోమవారం జొన్నబండ ప్రాంతంలోని ఐస్ ఫ్యాక్టరీ రోడ్డులో అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అన్నదానం మహాదానమని, అమావాస్య రోజున అన్నదానం చేయడం వల్ల పితృదేవతలు సంతోషిస్తారని నిర్వాహకులు తెలిపారు.ప్రతి నెలా అన్నదాన కార్యక్రమానికి విరాళాలు అందించే దాతలను ప్రోత్సహించేందుకు లక్కీడిప్ నిర్వహించి, విజేతలకు వాసవీమాత విగ్రహాన్ని అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమ నిర్వాహకులు ఆయిత సత్యం, తోడుపునూరి బాలేశ్వర్, పాలకుర్తి సురేష్‌కుమార్, అమర బాలేష్, తడక వెంకటేష్, గంగా మల్లేష్‌తో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భక్తి సంగమంలో దేవనూర్ భజన మండలి సభ్యులకు ఘన సన్మానం


లక్ష్మీ పూజ వేడుకలో ఆధ్యాత్మిక శోభ



తాండూరు నవంబర్ 8(జనంసాక్షి) తాండూరు నియోజకవర్గంలో నియాలాల మండలం దేవనూర్ గ్రామంలో లింగమంతుల నాగలింగం దుకాణంలో నిర్వహించిన లక్ష్మీ పూజ వేడుక భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.ఈ పూజా కార్యక్రమానికి విచ్చేసిన దేవనూర్ భజన మండలి భక్తులను నిర్వాహకులు ప్రత్యేకంగా సన్మానించారు. భజన మండలి సభ్యులందరికీ శాలువా కప్పి, ఘనంగా సత్కరించడం జరిగింది.భజన కీర్తనలతో ఆ ప్రాంగణం ఆధ్యాత్మికంగా మారింది. లక్ష్మీదేవి అనుగ్రహంతో వ్యాపార, కుటుంబ అభివృద్ధి కలగాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శబరిమలకు మహా పాదయాత్ర

జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎంఆర్



తాండూరు నవంబర్ 8(జనంసాక్షి) తాండూరు నుండి శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాముల మహా పాదయాత్రను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ అయ్యప్ప స్వాముల మహా పాదయాత్ర విజయవంతంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగాలని ఆ అయ్యప్ప స్వామిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. తాండూరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థిస్తున్నా నని అన్నారు.యాత్ర ప్రారంభం అనంతరం అయ్యప్ప స్వాములతో కలిసి కొంతదూరం పాదయాత్రలో పాల్గొని, స్వాములకు శుభాకాంక్షలు తెలిపారు. స్వామియే శరణం అయ్యప్పా నినాదాలతో తాండూరు పట్టణం మార్మోగింది.

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

గీత కార్మికుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.సుధాకర్ గౌడ్



చేవెళ్ల, నవంబర్ 09 (జనంసాక్షి)గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలంగాణ రాష్ట్ర గీత కార్మికుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.సుధాకర్ గౌడ్ అన్నారు. రాష్ట్ర గీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామంలో ఆదివారం గీత కార్మికుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం. సుధాకర్ గౌడ్ గీత వృత్తిదారులకు సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. గీత వృత్తిదారులపై ఉన్న యాక్షన్ అవస్థలను రద్దు చేయాలని, సొసైటీలకు ఐదు నుంచి పది ఎకరాల వరకు భూమి కేటాయించాలని, జీవో నంబర్ 610 ప్రకారం ప్రతి గ్రామానికి సొసైటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా గీత కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, తాటి, ఈత, ఖర్జూర వనాల పెంపకానికి అవసరమైన ప్రోత్సాహకాలు, సదుపాయాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి సొసైటీకి, టీఎఫ్‌టీలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసుకొని ఐక్యంగా ముందుకు సాగాలని గీత కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లని ఈశ్వరయ్య గౌడ్, మల్లని చెన్నయ్య గౌడ్, మల్లని బాల్‌చెట్టి గౌడ్, సూర్యపేట రమేష్ గౌడ్, సూర్యపేట శ్రీనివాస్ గౌడ్, మల్లని సతీష్ గౌడ్, సూర్యపేట మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల కొరడా.. అక్రమ నిర్మాణాలు నేలమట్టం

మోహన్‌రావు కాలనీ, గబ్బిలాలపేటలో జేసీబీతో కూల్చివేతలు



జవహర్‌నగర్: నవంబర్ 9 (జనంసాక్షి):జవహర్‌నగర్ పరిధిలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారంతో కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు సోమ వారం రెవెన్యూ సిబ్బంది కూల్చివేతలు నిర్వహించారు.గిర్దావర్ సత్యనారాయణ సమక్షంలో రెవెన్యూ బృందం మోహన్‌రావు కాలనీ, గబ్బిలాల్‌పేట్ ప్రాంతాల్లో పర్యటించి అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను జేసీబీ సహాయంతో కూల్చివేసింది. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించడం తమ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పేద ప్రజలకు ప్రభుత్వ భూములను ఆశ చూపి విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్న అక్రమార్కులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలు ప్రభుత్వ భూములను కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. జవహర్‌నగర్ పరిధిలో ఎవరూ ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవద్దని, అక్రమ నిర్మాణాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు బానిసగా మారి చివరకు కటకటాల్లోకి



శేరిలింగంపల్లి, నవంబర్ 9 (జనంసాక్షి) : ఓ ఆశయం మనిషిని మహోన్నత వ్యక్తిగా... మరణానంతరం కూడా సమాజంలో జీవించి ఉండేలా తీర్చిదిద్దితే మరోవైపు వ్యసనం అదే మనిషిని విలువ లేని మనిషిగా... అద: పాతాళానికి తొక్కేస్తుందనడానికి ఈ ఘటన ఓ తార్కారంగా నిలుస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ మేరకు శేరిలింగంపల్లి డిసిపి సిహెచ్ వై శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం... ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు బానిసై ఆర్థిక అవసరాలకోసం ఎటూ గత్తింతర లేని స్థితిలో దొంగగా మారి దొంగతనానికి పాల్పడిన ఓ మేస్త్రీని గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. కొండాపూర్ శిల్పా వ్యాలీలోని సారా ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న సినిమాటోగ్రాఫర్ పోతిరెడ్డి అనుష్ కుమార్ రెడ్డి ఫ్లాట్‌లో ఈ నెల 2వ తేదీ రాత్రి ఎవరూ లేని సమయంలో భారీ చోరీ జరిగింది. దీంతో అతని ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తును కొనసాగిస్తుండగా అందిన సమాచారం మేరకు బోరబండ సర్దార్‌నగర్‌కు చెందిన లిమ్మక అనంత్ కుమార్(28) టెర్రస్ పైనుంచి తాడు సాయంతో బాల్కనీలోకి దిగి, స్లైడింగ్ డోర్, అల్మారా పగలగొట్టి సుమారు 35 తులాల బంగారం, 2 కిలోల వెండి అపహరించడం జరిగింది. అయితే అనుష్ కుమార్ రెడ్డి ఫిర్యాదులో పలు వివరాలను పొందుపరుస్తూ అనుమానం వ్యక్తం చేయగా దర్యాప్తు చేపట్టిన క్రైమ్ పోలీసులు ఈనెల 8వ తేదీన గచ్చిబౌలి చౌరస్తావద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి చోరీ సొత్తుతోపాటు హోండా యాక్టివా, మొబైల్ ఫోన్, రెండు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆన్లైన్ కు సంబంధించి డఫా బెట్ యాప్‌లో బెట్టింగులకు బానిసగా మారిన అనంత్ కుమార్ విచారణలో భాగంగా ఈ నేరానికి పాల్పడినట్లు అంగీకరించాడు. ఈ క్రమంలో శేరిలింగంపల్లి డిసిపి సిహెచ్ వై శ్రీనివాస్, అదనపు డిసిపి ఉదయ్ రెడ్డి పర్యవేక్షణలో నేరం జరిగిన నాలుగు రోజుల్లోనే కేసును ఛేదించిన సిబ్బందిని, నార్సింగి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, గచ్చిబౌలి ఎస్‌హెచ్ఓ ను అభినందించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రియురాలి ఇంట్లో యువకుడి ఆత్మహత్య



హయత్ నగర్, నవంబర్ 9 (జనం సాక్షి)ప్రియురాలి ఇంటికి వెళ్లిన ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్‌లోని కొత్తపేట, గ్రీన్ హిల్స్ కాలనీకి చెందిన కేతాల శివకుమార్ (25), ఈ నెల 8వ తేదీ రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో వనస్థలిపురంలోని శారదానగర్‌లో నివసించే తన ప్రియురాలి ఇంటికి వెళ్లాడు. అక్కడ అతడు న్యూసెన్స్ చేస్తుండటంతో, ఇంటికి వెళ్లిపోవాలని యువతి పలుమార్లు సూచించినప్పటికీ వినిపించుకోలేదు. దీంతో అతడిని ఇంటికి పంపించేందుకు యువతి ఓలా క్యాబ్ యాప్ ద్వారా ఆటో బుక్ చేసింది. అనంతరం ఇంటి బయట ఆటో కోసం వేచి చూస్తుండగా, శివకుమార్ మనస్తాపానికి గురై ఇంటిలోని బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఆ తర్వాత ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, యువకుడి మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎఫ్ఐ చొరవతో పెద్ద అంబర్‌పేటకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు

విద్యార్థుల సమస్యలపై నాలుగేళ్లుగా పోరాటం.. ఎట్టకేలకు ఫలించిన కృషి



అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 09(జనం సాక్షి):విద్యార్థుల ఉన్నత విద్యకు మరింత ప్రోత్సాహం లభించేలా పెద్ద అంబర్‌పేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కావడం హర్షణీయమని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ అన్నారు.ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్టు ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా అబ్దుల్లాపూర్‌మెట్టు మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుమార్లు అధికారులను కలిసి విజ్ఞప్తులు చేసినప్పటికీ హామీలకే పరిమితమయ్యారని తెలిపారు. సుమారు ఏడాది క్రితం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయగా, ఆరు నెలల్లో కళాశాలను ఏర్పాటు చేస్తామని ఎస్ఎఫ్ఐ నాయకత్వానికి హామీ ఇచ్చారని గుర్తుచేశారు.ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు పెద్ద అంబర్‌పేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కళాశాల ఏర్పాటుతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇంటికి దగ్గరలోనే ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుందని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యార్థుల గొంతుకగా నిలుస్తుందని, విద్యారంగ సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని గుండె శివకుమార్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాషా, శివ, హరీష్, చింటూ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ ఎం.ఐ.జి. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

పిపసి చైర్మన్ అరికపూడి



శేరిలింగంపల్లి, నవంబర్ 09 (జనంసాక్షి) : ఓల్డ్ ఎంఐజి బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా కృషి చేస్తానని రాష్ట్ర ప్రజాపద్దల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయనను బాధితులు కలుసుకొని తమ గోడును వినిపించిన నేపథ్యంలో వారికి సంఘీభావం ప్రకటిస్తూ శేరిలింగంపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తోకలిసి ఆయన మాట్లాడారు. భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎం.ఐ.జి.కాలనీలో సుమారు 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేద కుటుంబాలు రైల్వే విస్తరణ పనుల నేపథ్యంలో గుడిసెలు కోల్పోతున్న సమస్యపై తాజామాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి తదితరులు, బాధిత కుటుంబాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాల పరిస్థితిని ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో సంవత్సరాలుగా అక్కడే నివాసం ఉంటున్న పేద కుటుంబాలు రైల్వే విస్తరణ కారణంగా గుడిసెలు కోల్పోయి నిరాశ్రయులయ్యే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన ఈ కుటుంబాలకు ప్రత్యామ్నాయ నివాసం కల్పించాలని, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు కేటాయించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పిఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ రైల్వే విస్తరణలో గుడిసెలు కోల్పోతున్న అర్హులైన బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేద కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, బాధితులు ఎవరూ అధైర్యపడవద్దని అరికపూడి భరోసాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ ముదిరాజ్ ,బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుల హక్కుల కోసం పోరాడితే ముందస్తు హౌస్ అరెస్టులా

వికారాబాద్ జిల్లా సంఘం అధ్యక్షులు పోతురాజు సుధీర్



నవాబుపేట నవంబర్ 9(జనం సాక్షి):వికారాబాద్ జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్‌లో నిర్వహించాల్సిన ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.దివ్యాంగుల న్యాయమైన హక్కులు, ఉద్యోగాలు, పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, పెన్షన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయడం మా హక్కు. అలాంటి హక్కుల కోసం గొంతెత్తుతున్న నాయకులను ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే. దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకున్నంత మాత్రాన మా పోరాటం ఆగిపోదు. ఎన్ని నిర్బంధాలు విధించినా దివ్యాంగుల హక్కుల సాధన కోసం మా ఉద్యమం నిరంతరం కొనసాగుతుంది .ప్రభుత్వానికి మా డిమాండ్లు:దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి.అర్హులైన దివ్యాంగులకు కొత్త ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలి.దివ్యాంగులకు ప్రత్యేక సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలి.దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాలి.దివ్యాంగుల హక్కుల కోసం మా పోరాటం ఆగదు... మా గొంతును ఎవరూ అణచలేరు! ఈ యొక్క కార్యక్రమం లో ఊరడి హన్మంత్ వెంకటేష్, పాల్గొన్నారు.

ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



చేవెళ్ల, నవంబర్ 09 (జనంసాక్షి) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జుకన్నగారి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెన భీమ్ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పడాల రాములు, బండారి వెంకట్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సీతారాం రెడ్డి, గుడిమల్కాపూర్ డైరెక్టర్ పాండు, మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ లు గుండాల రాములు, నర్సింహులు, గంగి యాదయ్య, బురాన్ సురేష్, పొట్ట శుషాంత్, పడాల జనార్ధన్, మాణిక్యం, జనార్ధన్, జలీల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి పూజలో పాల్గొన్న కెఆర్ఆర్



దోమ నవంబర్ 09 జనం సాక్షి.పరిగి బ్రాంచ్ కపిల్ చిట్స్ కార్యాలయంలో దీపావళి సందర్భంగా జరిగిన లక్ష్మీ పూజా కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా మాజీ సర్పంచుల నేత కె.రాజిరెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు.వ్యాపారి వైశ్య సంఘం నాయకులు శ్రీనివాస్ గుప్త,సంస్థ పరిగి బ్రాంచ్ మేనేజర్ సిబ్బంది పాల్గొన్నారు.

బొంరాస్ పేట మండలంలో అంబరాన్నంటిన దీపావళి సంబరాలు

ఆలయాల్లో ప్రమిదలు వెలిగించి ప్రత్యేక పూజలు



బొంరాస్ పేట, నవంబర్ 9 (జనం సాక్షి): మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో కుటుంబ సభ్యుల మధ్య ప్రజలు సంతోషంగా అహ్లాదకరమైన వాతావరణంలో అంబరాన్నంటేలా దీపావళి సంబరాలను జరుపుకున్నారు. వ్యాపారులు తమ దుకాణ సముదాయాలను అందంగా బంతిపూలతో ముస్తాబు చేసి, లక్ష్మీదేవి పూజలు నిర్వహించారు. ఏర్పుమల్ల గ్రామంలో కోట మైసమ్మ ఆలయంలో ఓం ఆకారంలో ప్రమిదలు వెతికించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. దీపావళి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని రేగడి మైలారం శివారులో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణం జనాల రాకతో కిటకిటలాడింది.ఆదివారం నిర్వహించిన వారాంతపు సంతలో బంతిపూలకు డిమాండ్ పెరిగింది. దీపావళి పర్వదినం సందర్భంగా ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మున్సిపల్ కార్మికులకు మాజీ ఎంపీపీ చంద్ర శేఖర్ యాదవ్ నూతన దుస్తుల పంపిణీ

ముఖ్య అతిథిగా ఎంపీ ఈటెల



శామీర్ పేట, నవంబర్ 9 (జనం సాక్షి) మున్సిపల్ కార్మికుల సేవలు ఎనలేని వని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శామీర్ పేట 300 డివిజన్ కార్మికులకు ఎంపీపీల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన దుస్తులను ఎంపీ ఈటెల రాజేందర్ చేతుల మీదుగా అదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ.. కార్మికుల సేవలు ఎనలేనివని, ప్రతినిత్యం మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో శుభ్రం చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రాజు యాదవ్, సుభాష్ యాదవ్, పరమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

హకీంపేట రైతుమేళ బహిరంగ సభకు తరలి వెళ్లిన రైతులు



బొంరాస్ పేట, నవంబర్ 9 (జనం సాక్షి): మండల పరిధిలోని వివిధ గ్రామా లకు చెందిన రైతులు, మహిళలు దుద్యాల మండలం హకీంపేట శివారులో ఆదివారం ,సోమవారం నిర్వహించిన రైతుమేళ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులలో తరలి వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించి, వ్యవసాయ రంగంలో అనుసరించాల్సిన పద్ధతులను తెలుసు కున్నారు.మూడు రోజులపాటు నిర్వహించిన రైతుమేళా కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది.

తాండూరులో ఘనంగా దీపావళి వేడుకలు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టర్ సంపత్ కుమార్

తాండూరు నవంబర్ 8(జనంసాక్షి) : దీపావళి పండుగ సందర్భంగా తాండూరులో ఏర్పాటు చేసిన వివిధ పూజా కార్యక్రమాల్లో తాండూరు బాలాజీ నర్సింగ్ హోం అధినేత మరియు బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి అంటే చీకటిపై వెలుగు విజయం. ప్రతి ఇంట్లో సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని,తాండూరు ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలున తెలిపారు.ఈ కార్యక్రమంలో తాండూరు సీనియర్ నాయకులు కోర్వార్ నగేష్, వడ్డే శ్రీనివాస్, ప్రముఖ వ్యాపారవేత్తలు కల్వ రాజలింగం, తంబాకు బసవరాజ్, కోట వెంకటేశం, కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





పాలేరు నాయకులకు కాంగ్రెస్ ఎప్పుడూ అండగా ఉంటుంది

టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

బాలానగర్, నవంబర్ 9 (జనం సాక్షి): పాలేరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. సోమవారం పాలేరు సీనియర్ నాయకులు పొడుగు అప్పారావు, సాయిబాబా చాదరి తదితరులు అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న బండి రమేష్ వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని భరోసా ఇచ్చారు. ఇరువురు నాయకులు త్వరగా కోలుకుని తిరిగి పార్టీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గట్టిముక్కుల వెంకటేశ్వర్లు, కొప్పిశెట్టి దినేష్, అరవింద్‌రెడ్డి, శ్రీనివాస్‌బాబు, నాగార్జున, రాజేష్ శంకర్‌గౌడ్, చావా శ్రీనివాస్, ప్రవీణ్, శివ చాదరి, రామారావు, సురేష్, రవి, బిచ్చుమల్లి, బాజీ, మణిగౌడ్, నవాజ్, సంధ్య, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మీ కటాక్షంతో తాండూరులో వెలుగులు.

దీపావళి లక్ష్మీ పూజలో ఎమ్మెల్యే బీఎంఆర్

తాండూరు నవంబర్ 8(జనంసాక్షి) : దీపావళి పర్వదినం సందర్భంగా తాండూరు పట్టణం ఆధ్యాత్మిక శోభతో వెలిగి పోయింది. పట్టణంలో వ్యాపారవేత్తల ఆహ్వానం మేరకు పలు దుకాణాల సముదాయాల్లో జరిగిన శ్రీ లక్ష్మీదేవి పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంట్లో సుఖశాంతులు, ప్రతి వ్యాపారంలో లాభాలు, తాండూరు పట్టణంలో అభివృద్ధి వెల్లువలా రావాలని కోరుకుంటున్నా ను. దీపావళి అంటే చీకటి నుండి వెలుగులోకి ప్రయాణం. అందరి జీవితాల్లో ఆ వెలుగు నిండాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు.ప్రతి దుకాణంలో ఎమ్మెల్యే గారికి వ్యాపారవేత్తలు, ప్రముఖులు ఘనంగా స్వాగతం పలికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





కొడంగల్ మెగా రైతు మేళాకు తాండూరు నుండి తరలిన రైతులు

బస్సులకు జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎంఆర్.

తాండూరు నవంబర్ 8(జనంసాక్షి) : కొడంగల్ నియోజకవర్గంలోని హకింపేట్‌లో నిర్వహిస్తున్న మెగా రైతు మేళా (భారీ రైతు బహిరంగ సభ) కు తాండూరు నియోజకవర్గం నుంచి బయలుదేరిన రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల బస్సులకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పచ్చజెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూరైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం. రైతుల కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రైతులకు వివరించేందుకే ఈ మెగా రైతు మేళా నిర్వహిస్తున్నారు. తాండూరు నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలి వెళ్లడం సంతోషంగా ఉందని అన్నారు.రైతు మేళాలో పాల్గొని ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని రైతులకు, కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, నవంబర్ 09 (జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రిని కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలతో పాటు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి, పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో డిప్యూటీ స్పీకర్ బాలు నాయక్, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మందుల సామేల్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.





సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చింపుల సత్యనారాయణ రెడ్డి, బుయ్యని శ్రీనివాస్ గౌడ్

చేవెళ్ల : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని చేవెళ్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు చింపుల సత్యనారాయణ రెడ్డి, బుయ్యని శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలతో పాటు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుయ్యని శ్రీనివాస్ గౌడ్ ముఖ్యమంత్రితో చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి, కాంగ్రెస్ పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతం కోసం మరింత కష్టపడి పనిచేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రోంపల్లి గ్రామ బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేసిన మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ గౌడ్

బంట్వారం నవంబర్ 09 జనం సాక్షి : బంట్వారం మండల కాంగ్రెస్ పార్టీ బంట్వారం మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో సీఎం ర్ ఎఫ్ చెక్కుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రోంపల్లి గ్రామానికి చెందిన కురువ సరేప్ కు 1,28000 రూపాయలు, తలారి అనురాధ కు 10,000 రూపాయలు సీఎంఆరఎఫ్ చెక్కు గ్రామ మాజీ సర్పంచ్ రాధాకృష్ణ గౌడ్ అధ్యర్యంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాధాకృష్ణ గౌడ్ మాటటటుక్కు పేడలకు అత్త ధైర్యాన్ని భరోసాను కల్పించడానికి సీఎంఆరఎఫ్ ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్వీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి సంబరాలు.. సీఎం జన్మదిన వేడుకలు

చేవెళ్ల, నవంబర్ 09 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు దేవుని ఎర్రవల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, చేవెళ్ల మున్సిపల్ జనరల్ సెక్రటరీ కరికే మల్లేష్, దేవుని ఎర్రవల్లి పార్టీ ఉపాధ్యక్షుడు అర్జున్ శివయ్య, బస్తీపురం వెంకటయ్య, ఎండీ జావిద్, కరికే సత్యనారాయణ, వార్డు యూత్ అధ్యక్షుడు అర్జున్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



మెగా రైతు మేళ కొడంగల్‌కు పూడూర్ మండల రైతుల జన జాతర

పూడూర్ : పూడూరు మండలం నుండి అన్ని గ్రామాల లో మెగా రైతు మే లకు బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా బయలుదేరిన రైతులు కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు సర్పంచుల ఆధ్వర్యంలో ఈ రోజు చివరి రోజు కావడంతో అతిపెద్ద ఎత్తున ప్రతి గ్రామ గ్రామం నుండి రైతులు బస్సుయాత్రతో కొడంగల్ కు చేరుకున్నారు దీనికి రఘునాథ్ రెడ్డి మరియు సర్పంచులు గ్రామ ప్రజలు ఈ మీటింగ్‌కు హాజరు అయ్యారు

జనంసాక్షి

ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలి

- శ్రీ వెంకటేశ్వర ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య
- కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, భీమ్ భారత్
- తాజా కూరగాయలు, నాణ్యమైన ఆహార పదార్థాలు వినియోగించాలని సూచన
- ప్రతి గ్రామంలో ఎల్ఈడీ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తామని ఎంపీ హామీ



నవాబుపేట, నవంబర్ 9 (జనం సాక్షి): రెస్టారెంట్‌కు వచ్చే ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని, మెరుగైన సౌకర్యాలను అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. నవాబుపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీజేపీ మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామేన భీమ్ భారత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాఖాహారం, మాంసాహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన మటన్, చికెన్ వినియోగించాలని, కుటుంబాలతో వచ్చే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం మాట్లాడుతూ నిల్వ ఉంచిన ఆహార పదార్థాలకు బదులుగా ఎప్పటికప్పుడు తాజా సరుకులు తెచ్చి వంటకాలు తయారు చేయాలని సూచించారు. భీమ్ భారత్ మాట్లాడుతూ రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యం ఇస్తే రెస్టారెంట్‌కు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఇదే సందర్భంగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దీపావళి కానుకగా నవాబుపేట మండలంలోని ప్రతి గ్రామంలో ఎల్ఈడీ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు కేఎస్ రత్నం వెల్లడించారు. అనంతరం చిట్టిగిద్ద గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ గద్దెను ఆయన పరిశీలించారు. శివాజీ స్ఫూర్తితో హిందూ ఐక్యత, దేశ సమగ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెస్టారెంట్ నిర్వాహకులు మహేందర్, సంతోష్, సంపత్, శ్రీకాంత్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ కౌన్సిలర్ లక్ష్మి వేణుగోపాల్.. బీజేవైఎం అధ్యక్షుడు మధుగౌడ్‌కు శుభాకాంక్షలు



కీసర, నవంబర్ 09 (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలిని మాజీ కౌన్సిలర్ బుధవారం లక్ష్మి వేణుగోపాల్ అన్నారు. నాగారం డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా నియమితులైన మల్యాల మధుగౌడ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మి వేణుగోపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. యువతను పార్టీ వైపు ఆకర్షిస్తూ, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిపై అవగాహన కల్పించాలని మధుగౌడ్‌కు సూచించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మధుగౌడ్ మాట్లాడుతూ.. తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నాగారంలో బీజేవైఎంను బలోపేతం చేస్తానన్నారు.

తనపై నమ్మకంతో నాగారం డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. యువతను సంఘటితం చేస్తానన్నారు. యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ నాగారం డివిజన్‌లో బీజేవైఎంను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



రంగారెడ్డి, నవంబర్ 9 (జనంసాక్షి) : ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నమన్నారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 19, ఇతర శాఖలకు సంబంధించి 07, మొత్తం 26 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు డాక్టర్ కె. కిరణ్మయి, చంద్ర రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి కనకాభిషేకానికి రూ.3.53 లక్షల విరాళం

కూకట్ పల్లి నవంబర్ 09(జనంసాక్షి):
శ్రీ భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి దేవస్థానంలోని శ్రీ మహాశాస్త అయ్యప్ప స్వామి కనకాభిషేకం కోసం 2025లో నిర్వహించిన వేలం పాటలో రూ.3,53,000 లకు దక్కించుకున్న మానవ సేవ ఫౌండేషన్ చైర్మన్ గోకర్ల లక్ష్మీనారాయణ , ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును సీనియర్ కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల జెస్వంత్ రావు (దేశాల్) చేతుల మీదుగా ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, పెద్దలు, దేశాల్ మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దండుమైలారం సర్పంచ్ నరేష్ గౌడ్

ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రంగారెడ్డి , నవంబర్ 9 (జనంసాక్షి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని దండు మైలారం సర్పంచ్ నరేష్ గౌడ్ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని దండుమైలారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 'ఎ' గ్రేడ్ రకం వడ్లకు క్వింటాలుకు రూ.2,461, కామన్ గ్రేడ్ రకానికి రూ.2,404 మద్దతు ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్‌డిఓ జోజప్ప ఏపీఎం సాంబశివుడు, విఓఏలు లావణ్య, రాజమణి, శాంత, మమత, సీసీలు జంగమ్మ, మల్లేష్, సత్తయ్యలతో పాటు పలువురు వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధు రావణ్ కలిసిన జిల్లా నాయకుడు

కోట్‌పల్లి నవంబర్ 09(జనంసాక్షి):
తెలంగాణ భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధు రావణ్‌ను వికారాబాద్ జిల్లా భీమ్ ఆర్మీ నాయకులు పోలాస్ పృథ్వీరాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో భీమ్ ఆర్మీ చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. త్వరలో భీమ్ ఆర్మీ చీఫ్, ఉత్తరప్రదేశ్‌లోని నగీనా ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్‌తో కలిసి తెలంగాణలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సిద్ధు రావణ్ తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. అలాగే వికారాబాద్ జిల్లాలోని పలు సమస్యలు, పార్టీ కార్యక్రమాలపై నాయకులు చర్చించారు.

విజయ హైస్కూల్‌లో వైభవంగా 'స్పేస్ ఆన్ వీల్స్'అవుట్ రీచ్ ప్రోగ్రామ్

కాప్రా, నవంబర్ 9 (జనం సాక్షి) : విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించి, వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని, పరిశోధనా తత్వాన్ని పెంపొందించాలనే స్పేస్ ఆన్ వీల్స్'అవుట్ రీచ్ ప్రోగ్రామ్ దోహదపడుతుందని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఛీ=ాజ)కు చెందిన స్టూడెంట్ అండ్ పబ్లిక్ అవుట్ రీచ్ డివిజన్ హెడ్ డాక్టర్ ఆర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం కాప్రా లొ ని విజయ హై స్కూల్ లో స్పేస్ ఆన్ వీల్స్'అవుట్ రీచ్ ప్రోగ్రామ్ ఘనంగా నిర్వహించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ, మరియు హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ అప్లికేషన్ ద్వారా అంతరిక్ష పరిశోధనా రంగంలో సాధించిన అద్భుత విజయాలను, అంతరిక్ష పరిశోధనలోని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు ప్రత్యక్ష నమూనాలు, వీడియోలు, పీపీటీ ప్రదర్శనలు, నిపుణుల వివరణల ద్వారా పరిచయం చేశారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఛీ=ాజ)కు చెందిన స్టూడెంట్ అండ్ పబ్లిక్ అవుట్ రీచ్ డివిజన్ హెడ్ డాక్టర్ ఆర్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్పేస్ ఆన్ వీల్స్ అవుట్ రీచ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రాధాన్యతను వివరిస్తూ భారత అంతరిక్ష పరిశోధనా రంగం సాధించిన విజయాలు



భవిష్యత్తులో లక్ష్యాలుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రయాన్-3 దక్షిణ ధ్రువ అన్వేషణకు సంబంధించిన నమూన మరియు భూమిపై ఉన్న గ్రౌండ్ స్టేషన్లు రాకెట్ ప్రయోగ కేంద్రాలు ఉన్న నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిపుణులు రాకెట్ల నిర్మాణం,వాటి ప్రయోగ విధానాలు, ఉపగ్రహాల పనితీరు,అంతరిక్ష పరిశోధన ల గురించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. చంద్రయాన్ శాటిలైట్స్, మంగళయాన్, గగన్ యాన్, మరియు ఆదిత్య ా1 వంటి ప్రతిష్టాత్మక అంతరిక్ష ప్రయోగాల లక్ష్యాలు వాటి శాస్త్రీయ ప్రాధాన్యతను వివరించారు. హై స్కూల్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వీడియో పిపిటి ప్రదర్శనల ద్వారా భారత శాస్త్ర సాంకేతిక రంగం ఆవిర్భావం, అభివృద్ధి, అంతరిక్ష పరిశోధనలో సాధించిన విజయాలు వాటి ప్రాధాన్యతతో పాటు భవిష్యత్తులో విద్యార్థులకు అందుబాటులో ఉన్న అవకాశాలను డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 1500 మంది విద్యార్థులు తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరు రాజేశ్వర్, ప్రిన్సిపల్ డి.వి.బాబు, ప్రధానోపాధ్యాయురాలు యం. వి. పద్మావతి, ఉపాధ్యాయ బృందం మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ధారూర్‌లో క్రైస్తవ మహాజాతర

- కాగ్నా నది తీరంలో 104వ మెథడిస్ట్ ఉత్సవాలు ప్రారంభం
- ఆరు రోజులపాటు ఆధ్యాత్మిక సందడి..
- 10 నుంచి 15 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- 35 ఎకరాల్లో భారీ ఏర్పాట్లు.. దేశవిదేశాల నుంచి రాక
- భద్రత, వైద్యం, తాగునీరు, రవాణా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి



ధారూర్, నవంబర్ 9 (జనం సాక్షి): వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ధారూర్ మెథడిస్ట్ క్రిస్టియన్ మహాజాతరకు సర్వం సిద్ధమైంది. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలంలోని ధారూర్ స్టేషన్, దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నా నది తీరంలో నవంబర్ 10 నుంచి 15వ తేదీ వరకు 104వ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆరు రోజులపాటు జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుకలకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఈ ఏడాది సుమారు 10 నుంచి 15 లక్షల మంది హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఆసియా ఖండంలోనే విశిష్ట గుర్తింపు పొందిన ఈ మహాజాతర కోసం 35 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. 1922లో ఇప్పచెట్టు కింద ప్రారంభమైన ప్రార్థనా కార్యక్రమం నేడు లక్షలాది మంది పాల్గొనే మహాజాతరగా విస్తరించింది. 1921లో గుల్బర్గా నుంచి హైదరాబాద్‌కు రైలులో ప్రయాణిస్తున్న రెవరెండ్ సీమండ్స్, ఆయన మిత్రుడు జేటీ సీమండ్స్ ధారూర్ రైల్వేస్టేషన్ వద్ద రైలు నిలిచిపోవడంతో కాగ్నా నది తీరానికి చేరుకుని ఇప్పచెట్టు కింద ప్రార్థనలు చేశారు. వారి ప్రార్థనలు ఫలిస్తే ప్రతి సంవత్సరం ఇక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని మొక్కుకున్నారు. అనంతరం 1922లో తిరిగి వచ్చి అక్కడ శిలువను ప్రతిష్ఠించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. నాటి ప్రార్థనకు గుర్తుగా ఇప్పచెట్టు ఆనవాళ్లు నేటికీ జాతర ప్రాంగణంలో ఉండటం విశేషం.

ఉత్సవాల సందర్భంగా ఆరు రోజులపాటు కీర్తనలు, ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు, బైబిల్ సందేశాలు నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పాస్టర్లు, మత పెద్దలు భక్తులకు ఆధ్యాత్మిక సందేశాలు అందించనున్నారు. ప్రేమ, శాంతి, క్షమాగుణం, మానవత్వం, సేవాభావం వంటి విలువలను చాటిచెప్పనున్నారు. కుటుంబాల క్షేమం, ఆరోగ్యం, అభివృద్ధి కోసం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. అమెరికా, ఇంగ్లండ్ తదితర దేశాల నుంచి కూడా ప్రత్యేక ఆహ్వానితులు, మత పెద్దలు హాజరుకానున్నారు.

లక్షలాది మంది భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు అవసరమవుతున్నాయి. సుమారు 200 నుంచి 300 మంది పోలీసులతో బందోబస్తు, ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా, వాహనాల పార్కింగ్, బారికేడ్ల ఏర్పాటు చేయనున్నారు. తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టనున్నారు. నాగసముందర్, ధారూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచనున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లు, అదనపు రైలు నిలుపుదలలు, ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. జాతరతో స్థానిక వ్యాపారాలు, చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. ప్రభుత్వ శాఖలు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రామంతాపూర్‌లో ఘనంగా అవులగడ్డ సదర్ సమ్మేళనం

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, నవంబర్ 9 (జనం సాక్షి): రామంతాపూర్ గాంధీనగర్ రెండో వీధిలో అవులగడ్డ నరేందర్ యాదవ్ నివాసంలో ఆదివారం నిర్వహించిన 2026 సదర్ సమ్మేళనం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవ సోదరులు నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవం, ఐక్యతకు సదర్ సమ్మేళనం ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు, సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని అన్నారు.సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించిన అవులగడ్డ నరేందర్ యాదవ్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

టౌన్ ప్లానింగ్ విభాగానికే అత్యధికంగా 18 ఫిర్యాదులు

- వినతులను స్వీకరించిన సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. సృజన
- ప్రతి అర్జీకి ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్
- శేరిలింగంపల్లి జోన్ పరిధిలోనూ ప్రజావాణికి వినతులు



శేరిలింగంపల్లి, నవంబర్ 9 (జనం సాక్షి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ డాక్టర్ జి. సృజనకు సోమవారం 26 ఫిర్యాదులు అందాయి. సీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె స్వయంగా అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వీటిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 18, ఇంజినీరింగ్ విభాగానికి 4, రెవెన్యూ (ప్రాపర్టీ ట్యాక్స్) విభాగానికి 2, ఇరిగేషన్‌కు ఒకటి, ట్రేడ్ లైసెన్స్ విభాగానికి ఒక ఫిర్యాదు అందినట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్ కేటాయించి పరిష్కార స్థితిని తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పారదర్శకంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ నేత మిద్దెల మల్లారెడ్డి అయ్యప్ప సొసైటీలో అక్రమాలపై కమిషనర్‌కు రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు.

ఇదిలా ఉండగా, శేరిలింగంపల్లి జోన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ విభాగాల నుంచి ఫిర్యాదులు అందాయి. మియాపూర్ సర్కిల్ పరిధిలో 5, అమీన్‌పూర్ సర్కిల్‌లో 3, నార్సింగి సర్కిల్‌లో 5, పటాన్‌చెరు సర్కిల్‌లో 2 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఫిర్యాదును గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్‌తో అనుసంధానించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ డాక్టర్ నారాయణ అమిత్ వెల్లడించారు. ప్రజలకు పారదర్శకమైన, ప్రజాభిముఖ పాలన అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

ఉప్పల్‌లో నూతన ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

- రోజుకు 600 మందికి సేవలందించేలా ఏర్పాట్లు
- ముందస్తు టోకెన్‌తో నిరీక్షణకు చెక్
- అధిక రుసుములు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలి

ఉప్పల్, నవంబర్ 9 (జనం సాక్షి): ఆధార్ సేవల కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించే లక్ష్యంతో ఉప్పల్‌లో నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఉప్పల్ మెట్రో రైల్వే స్టేషన్ పిల్లర్ నంబర్ సి-870 వద్ద (నాగోల్ వైపు) ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని సోమవారం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పి. సంగీత, ఐఏఎస్ ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలించారు. రోజుకు 500 నుంచి 600 మందికి ఆధార్ సంబంధిత సేవలు అందించేలా సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ కేంద్రం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆధార్ సేవల కోసం గంటల తరబడి వేచి ఉండే పరిస్థితిని నివారించేందుకు ఆన్‌లైన్‌లో ముందస్తు టోకెన్ పొందే సదుపాయం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఇంటి నుంచే సమయాన్ని కేటాయించుకుని, నిర్ణీత సమయానికి కేంద్రానికి చేరుకోవచ్చని సూచించారు. దీనివల్ల రద్దీ తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఆధార్ కొత్త నమోదు పూర్తిగా ఉచితం. ఐదు, 15 ఏళ్ల వయస్సులో తప్పనిసరిగా చేపట్టే వేలిముద్రలు, కనుపాపల గుర్తింపు నవీకరణకు ఎలాంటి రుసుము ఉండదని అధికారులు స్పష్టం చేశారు. వ్యక్తిగత వివరాల మార్పునకు రూ.75, వేలిముద్రలు, కనుపాపల గుర్తింపు నవీకరణకు రూ.125 చెల్లించాలని తెలిపారు. నిర్ణీత రుసుములకు మించి ఎవరైనా అదనంగా వసూలు చేస్తే వారిని ఆశ్రయించవద్దని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అధికారిక కేంద్రంలోనే సేవలు పొందాలని సూచించారు.

కేంద్రానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అధికారులను ఆదేశించారు. ముందస్తు టోకెన్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని, వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, చిన్నపిల్లలతో వచ్చే తల్లిదండ్రులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. సేవలకు అవసరమైన పత్రాలు, రుసుములు, విధానాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలన్నారు.ముందస్తు సమయ కేటాయింపు కోసం UIDAI అధికారిక వెబ్‌సైట్ ద్వారా టోకెన్ పొందవచ్చని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో UIDAI హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ కె.ఎం. భారతి, డిప్యూటీ డైరెక్టర్ నాయిని శ్రీ రంగనాథ్ రెడ్డి, తెలంగాణ ప్రాజెక్టు నిర్వాహకుడు నరేష్ చంద్ర, సహాయ నిర్వాహకుడు పి. రత్నాకర్, బీఎల్ఎస్ సంస్థ ప్రాంతీయ నిర్వాహకుడు శ్రీనివాస్ కుమార్, విభాగ నిర్వాహకుడు దుగ్గి హరినాథ్, జిల్లా నిర్వహణాధికారి సి. కార్తీక్, కేంద్ర నిర్వాహకుడు బి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మికత.. పర్యావరణ చైతన్యం

పాత ఆల్వాల్‌లో పారాయణం, సైకిల్ యాత్ర.. నేడు ఉచిత యోగా శిబిరం

అల్వాల్, నవంబరు 9 (జనంసాక్షి): ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యమే లక్ష్యంగా పాత ఆల్వాల్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జొన్నబండలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా, భగవద్గీత శ్లోకాల పారాయణం చేపట్టారు. ప్రతి దేవాలయంలోనూ వారానికి ఒకరోజు గంటపాటు భజనలు, పారాయణాలు నిర్వహించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.గ్లోబల్ ఆక్సిజన్ కార్బన్ డయాక్సైడ్ సైకిల్ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం సైకిల్ యాత్ర నిర్వహిస్తూ ఆరోగ్య పరిరక్షణ, వాయు కాలుష్య నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. సైకిల్ వినియోగంతో ఇంధనం, డబ్బు ఆదా చేయవచ్చని ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమంలో రాజు, జగన్, అశోక్, సతీష్, అప్పన్నరెడ్డి తదితరులు పాల్గొంటున్నారు.

నేడు ఉచిత యోగా శిబిరం

పతంజలి యోగ, భారత స్వాభిమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు పాత ఆల్వాల్‌లోని వి.బి.ఆర్. తోటలో ఉచిత యోగా శిబిరం, వైదిక యజ్ఞం నిర్వహించనున్నారు. పతంజలి మేడ్చల్ జిల్లా పర్యవేక్షకుడు దేవేందర్‌జీ యోగా సాధన చేయిస్తారని నిర్వాహకుడు భోగ విష్ణుమూర్తి తెలిపారు. వివరాలకు 8143744761 నంబరులో సంప్రదించాలని కోరారు.

